
సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 23 । జూలై । 2023



రూ.50 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు గుంటూరి సురేష్, శ్రీదేవి దంపతులు (కాకినాడ) శనివారం రూ.50,011 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 4 వేలు, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు.

శ్రీకృష్ణ మందిర్ నిర్మాణానికి..



అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్మాణానికి దూనబోయిన ప్రసన్న కుమార్ (కొత్తపేట మండలం వానపల్లి శివారు కోతుల తోట) శనివారం రూ.50 వేలు విరాళం సమర్పించారు.

న్యూస్‌రీల్

రత్నగిరిపై భక్తుల రద్దీ



రత్నగిరిపై సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది అధిక శ్రావణ శుద్ధ చవితి పర్వదినం సందర్భంగా ఉదయం నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూలైన్లు, స్వామివారి ఆలయం భక్తులతో నిండిపోయాయి. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించినట్టు ఆలయ అధికారులు తెలిపారు. సత్యదేవుడిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ దేవస్థానంలోని పలు విభాగాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సత్యదేవుని దర్శించిన సినీ హీరో సాయి ధరమ్ తేజ్



సత్యదేవుని ఆలయం వద్ద సినీ హీరో సాయి ధరమ్ తేజ్

అన్నవరం: ప్రముఖ సినీ హీరో సాయిధరమ్ తేజ్ శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. సముద్రఖని దర్శకత్వంలో తెరకెక్కిన 'బ్రో' సినిమా విజయవంతం కావాలని సాయిధరమ్ తేజ్ పూజలు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి ప్రత్యేక డ్రైవ్ : కలెక్టర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పేదలకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ వి.మాధవీలత సూచించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్‌తో కలసి క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు సజావుగా సాగుతున్నా, రాష్ట్ర స్థాయి అధికారులు నిర్దేశించిన లక్ష్యాల సాధనకు మరింత నిబద్ధతతో పని చేయాలన్నారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యంలో 19,896 గృహాలకు గాను 18,572 పూర్తి చేశారని తెలిపారు. 1,144 ఇళ్లను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి వారం పనుల్లో పురోగతి సాధించాలని స్పష్టం చేశారు. జగనన్న లేఅవుట్లలో సదుపాయాల కల్పనకు యాక్షన్ ప్లాన్ అమలు చేయాలన్నారు. డేటా అప్లోడ్ చేయడంలో సాంకేతిక ఇబ్బందులు ఉంటే టెక్నికల్ అసిస్టెంట్ జిల్లా యాంకర్ పర్సన్ దృష్టికి తీసుకురావాలని అన్నారు. వివరాలు నమోదు చేస్తే సంబంధిత బిల్లుల చెల్లింపులు వేగంగా జరుగుతాయని తెలిపారు. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 2023-24 విద్యా సంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశానికి శనివారం పరీక్ష నిర్వహించారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తెలిపారు.

తగ్గుతూ..పెరుగుతూ..

- బ్యారేజి వద్ద తగ్గిన గోదావరి ఉధృతి
- భద్రాచలంలో మళ్లీ పెరుగుతున్న వరద



పుష్కరఘాట్ వద్ద వరద ఉధృతి

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ వద్ద నీటి ఉధృతి శనివారం క్రమేపీ తగ్గుతూ వచ్చింది. అదే సమయంలో ఎగువ ప్రాంతానికి సంబంధించి భద్రాచలం వద్ద నీటి ఉధృతి మళ్లీ పెరుగుతోంది. దీంతో ఆదివారం ధవళేశ్వరం వద్ద కొంత మేర నీటి ఉధృతి పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. బ్యారేజ్ వద్ద శనివారం రాత్రి 7గంటలకు 10.80 అడుగులకు నీటి మట్టం చేరింది. బ్యారేజ్ నుంచి 8,56,185క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. భద్రాచలం వద్ద నీటి ఉధృతి తిరిగి పెరుగుతుండటంతో ఇరిగేషన్ యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. ఫ్లడ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాటన్ బ్యారేజ్ వద్ద నీటి ఉధృతి శనివారం క్రమేపి తగ్గుముఖం పట్టింది. శుక్రవారం రాత్రి 7 గంటలకు 11.70అడుగులు చేరిన నీటి మట్టం శనివారం తెల్లవారుజామున 4గంటల వరకు నిలకడగా అదే స్థాయిలో కొనసాగింది. అనంతరం క్రమంగా తగ్గుతూ వచ్చింది. శనివారం మధ్యాహ్నం 12గంటలకు 11.20 అడుగులకు చేరింది. రాత్రి 7 గంటలకు మరింత తగ్గింది. నీటి మట్టం 10.80అడుగులకు చేరింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో నీటి ఉధృతి స్వల్పంగా పెరుగుతున్నట్లు సమాచారం. కాళేశ్వరంలో 11.15మీటర్లు, పేరూరులో 16మీటర్లు, దుమ్ముగూడెంలో 11.48మీటర్లు, భద్రాచలంలో 40.40అడుగులకు, కూనవరంలో 17.16మీటర్లు, కుంటలో 8.53మీటర్లు, పోలవరం కాఫర్ డ్యామ్ వద్ద 32.70మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జ్ వద్ద 15.63మీటర్లు వద్ద నీటి మట్టాలు నెలకొన్నాయి.

నీట మునిగిన కాజ్‌వే

అయినవిల్లి : అయినవిల్లి మండలం ముక్తేశ్వరం వద్ద ఎదురుబిడిం కాజ్‌వే తెల్లవారుజామున నీట మునిగింది. అయితే వాహనాల రాకపోకలు యధాతథంగానే కొనసాగుతున్నాయి. పి.గన్నవరం మండలం జి.పెదపూడిలంక, ఊడిమూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండల పరిధిలోని పెదమల్లంక, అనగార్లంకలకు వెళ్లే దారి కొట్టుకుపోయింది. కనకాయలంక కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉండటంతో కనకాయలంక, పుచ్చల్లంకలకు వాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

సీజ్ చేసిన బియ్యం 31న వేలం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పరిధిలో నిత్యావసర వస్తువుల చట్టం కింద సీజ్ చేసిన 1318.39 క్వింటాళ్ల రా బియ్యాన్ని ఈనెల 31న వేలం వేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొన దలచినవారు రూ.2 లక్షలు జాయింట్ కలెక్టరు, తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ తీయాలన్నారు. ఆధార్, జీఎస్టీ, పాన్ కార్డు నకళ్లను తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. తర్వాత శాంపిల్ పరిశీలించుకోవచ్చునన్నారు.

నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కేసులు

రాజమహేంద్రవరం సిటీ: గర్భస్థ పూర్వ,గర్భస్థ పిండ నిర్ధారణ చట్టం కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. మాధవీలత మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలోనూ. గర్భస్రావాలు జరుగుతున్న ఆస్పత్రుల పైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విస్తృత స్థాయిలో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించాలన్నారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడే స్కాన్ సెంటర్లపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో మాతృ, శిశు మరణాలు సంభవించకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 179 కేసుల పరిష్కారం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రత్యేక లోక్ అదాలత్‌లో 179 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోటార్ వాహన ప్రమాదాల్లో పరిహారం చెల్లింపుల్లో ఆలస్యం నివారించి కక్షిదారులకు సత్వర న్యాయం చేస్తున్నామన్నారు. మోటారు వాహన ప్రమాదాలకు చెందిన 526 కేసులకు గాను 178 కేసులను రూ.8,83,18,449లకు, భూసేకరణకు చెందిన ఒక కేసుకు రూ.8,90,777 పరిహారం చెల్లించాలని అవార్డ్ ఇచ్చారన్నారు. ప్రత్యేక లోక్ అదాలత్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు, 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి పీఆర్ రాజీవ్, ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ప్రసాద్, 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.విజయ్‌గౌతమ్, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీయూవీ రాజు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో కేసును పరిష్కరించి అవార్డు పత్రాన్ని అందజేస్తున్న గంధం సునీత

మొక్కవోని దీక్షతో ముందుకు..

- హరిత నగరంగా రాజమహేంద్రవరం
- ప్రతిష్టాత్మకంగా 'గో గ్రీన్ చాలెంజ్'
- ఎంపీ భరత్‌రామ్, సినీనటి కామ్నా జెఠ్మలానీ

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరాన్ని హరిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మొక్కవోని దీక్షతో యువతా హరిత (గో గ్రీన్ చాలెంజ్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో కొత్తగా నిర్మించిన డివైడర్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని హీరోయిన్ కామ్నా జఠ్మలానీతో కలసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్‌తో మానవాళికి ముప్పు ఉందని నిపుణులు చెబుతున్నారని, ఇది గుర్తించకపోతే ప్రమాద ఘంటికలు మోగుతాయన్నారు. దేశంలో 145 కోట్ల కు పైగా జనాభా ఉన్నారని, ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షిస్తే భారతావని హరిత వనంగా మారు తుందన్నారు. భూమిని వేడిమి నుంచి కాపాడుకోకుంటే జీవించే ప్రతి ప్రాణికి ముప్పు తప్పదన్నారు. హరి త విప్లవంపై అందరికీ అవగాహన కల్పించాల్సిన బా. ధ్యత విద్యావంతులు, మేధావులపై ఉందని అన్నారు. ప్రధానంగా విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకుని చంటి బిడ్డలా పెంచాలని పిలుపునిచ్చారు. చెట్ల నుంచి మనకు ప్రాణ వాయువు అందుతున్నప్పుడు వాటిని ప్రాణం కన్నా మిన్నగా చూసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో జగనన్న హరిత నగరాలు కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరంలో హరిత విప్లవాన్ని రెండేళ్ల నుంచి కొనసాగిస్తున్నామని ఎంపీ తెలిపారు. ఇలాంటి సమాజ హిత కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా అందరూ ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాలని ఎంపీ ఆహ్వానించారు. విద్యావంతులు వస్తే అవినీతి, అరాచకాలను అంతం చేయవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ నగర కోఆర్డినేటర్‌గా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను సీఎం జగన్ నియమించడానికి ఇదే కారణమన్నారు. వచ్చే ఎన్నికల్లో డాక్టర్ గూడూరిని అర్బన్ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే నగరాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తారన్నారు. సినీ నటి కామ్నా జెఠ్మలానీ మాట్లాడుతూ రాజమహేంద్రవరం అంటే తనకెంతో ఇష్టమన్నారు. నగరంలో అడుగు పెడుతున్నప్పుడు పచ్చని చెట్లు ఆప్యాయంగా ఆహ్వానిస్తున్నట్లు అనిపించిందన్నారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని ఎంపీ మంచి కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను దత్తత తీసుకుని సంరక్షించాలని యువతను కోరారు. పార్టీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, టీకే విశ్వేశ్వరరెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మమ్మ నగర బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, శ్రీ ఉమామార్కెండేయ స్వామి దేవాలయం చైర్మన్ యిన్నమూరి ప్రదీప్, మాజీ కార్పొరేటర్లు బర్రె కొండబాబు, అర్జరపు వాసు, బెజవాడ రాజ్‌కుమార్, గూడూరి రాధిక తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటి నీరు పోస్తున్న ఎంపీ భరత్‌రామ్, సినీనటి కామ్నా జెఠ్మలానీ. చిత్రంలో గూడూరి శ్రీనివాస్

తాడిపూడి ఎత్తిపోతల నుంచి నీరు విడుదల

పాల్గొన్న హోం మంత్రి తానేటి వనిత

తాళ్లపూడి : రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ఖరీఫ్ సీజన్‌కు శనివారం ఆమె నీటిని విడుదల చేశారు. ముందుగా మోటార్లకు పూజలు నిర్వహించారు. కొబ్బరికాయ కొట్టి రెండు మోటార్ల ద్వారా నీటిని విడుదల చేశారు. అనంతరం పంప్ హౌస్ వద్ద గోదావరికి హారతి ఇచ్చారు. పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. తాడిపూడి పథకం నుంచి ఈ సీజన్‌లో 1.57 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. పూర్తి లక్ష్యం 2.06 లక్షల ఎకరాల ఆయకట్టు అని చెప్పారు. గతేడాది 4 టీఎంసీల నీటిని పంప్ చేశారన్నారు. ప్రస్తుతం రెండు మోటార్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఈఈ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



స్విచ్ ఆన్ చేసి నీరు విడుదల చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ సహకారం : కలెక్టర్ మాధవీలత

నిడదవోలు: ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదవాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఆమె రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ తెరిచిన మొదటి రోజే ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, దుస్తులు, షూస్ అందిస్తోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులను చూసి గతంలో తాను కూడా అక్కడ చదువుకోవాలని భావించేదానినన్నారు. కానీ నేడు ప్రభుత్వ స్కూళ్లలో అంతకు మించి నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. కార్పొరేట్ స్కూల్స్ నుంచి కూడా పిల్లలు ప్రభుత్వ స్కూల్స్‌కు వస్తున్నారన్నారు. ప్రతీ విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలన్నారు. దీనిని చేరుకోవాలంటే ప్రణాళికతో అడుగులు వేయడం ముఖ్యమన్నారు. ప్రభుత్వం నుంచి అని విధాల సహకారం అందించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, విద్యా కానుక వంటి పథకాలు అమలు చేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తోందని మాధవీలత చెప్పారు. అంతకు ముందు కలెక్టరుకు విద్యార్థులు బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు. బాలికలతో కలసి కలెక్టర్ ఉత్సాహంగా బ్యాండ్ బాజా మోగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, డీఈఓ ఎస అబ్రహం, ఎంఈవోలు విజ గణేష్, గురుస్వామి, హెచ్ఎం సీహెచ్ పద్మా, కౌన్సిలర్లు ముండంది మాణిక్యమాల, ఎస్‌కే వజీరుద్దీన్, కామిశెట్టి సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, గంగులు గోపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినితో ఆనందాన్ని పంచుకుంటున్న కలెక్టర్ మాధవీలత

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- ఏర్పాట్లు పక్కాగా జరగాలి
- ఎమ్మెల్సీ తలశిల రఘురాం సూచన
- పనుల పరిశీలన
- జిల్లా అధికారులతో సమీక్ష

సాక్షి, అమలాపురం: 'మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యుల ఖాతాల్లో సున్నా వడ్డీ రాయితీ నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26న జమ చేయనున్నారు. అమలాపురంలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న సీఎం పర్యటనను అధికారులు విజయవంతం చేయాలి' అని ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయ కర్త తలశిల రఘురాం అధికారులకు సూచించారు. సీఎం సభ ఏర్పాట్ల పరిశీలనకు శనివారం ఆయన ఇక్కడకు వచ్చారు. హెలిపాడ్ ఏర్పాటు చేస్తున్న పోలీసు క్వార్టర్స్ ప్రాంతంతో పాటు సభ జరిగే బాలయోగి స్టేడియాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి రఘురాం పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష జరిపారు. సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. వీవీఐపీలకు ప్రొటోకాల్ పాటించాలన్నారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యాన హెలిపాడ్ నిర్మించాలని, బారికేడింగ్, గ్యాలరీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సీఎం పర్యటించే రోడ్లను, సభా ప్రాంగణం వద్ద అప్రోచ్ రోడ్లను పక్కాగా తీర్చిదిద్దాలని రఘురాం సూచించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యాన సభకు వచ్చే మహిళలు కూర్చునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, కనీస వసతులు కల్పించాలని అన్నారు. వేదిక ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పర్యవేక్షించాలని చెప్పారు. సభాస్థలికి దూరంగా పార్కింగ్ కేటాయించి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రజల నుంచి సీఎం జగన్ విజ్ఞాపనలు స్వీకరించేందుకు సభా ప్రాంగణం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రఘురాం సూచించారు. సమావేశంలో ఎస్పీ ఎస్.శ్రీధర్, ఆర్డీఓలు ఎం.ముక్కంటి, ఎస్ఎస్‌వీబీ వసంత రాయుడు, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి పాల్గొన్నారు.


హెలిపాడ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ రఘురాం, కలెక్టర్ శుక్లా

920 కేజీల గంజాయి స్వాధీనం

గోపాలపురం: గంజాయి లోడుతో వెళ్తున్న కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు గోపాలపురం ఎస్సై కొరివి రామకృష్ణ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దేవరపల్లి సీఐ ఎ.శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం గోపాలపురం నుంచి దేవరపల్లి వెళ్తున్నారు. గోపాలపురం శివారు పొగాకు బోర్డు వద్దకు వచ్చేసరికి ఆయన వాహనాన్ని చూసిన కంటైనర్ డ్రైవర్ ఆ వాహనాన్ని రోడ్డు పక్కన వదిలిపెట్టి పరారయ్యాడు. దీంతో అనుమానం వచ్చిన సీఐ శ్రీనివాసరావు ఆ కంటైనర్‌ను పరిశీలించగా అందులో 920 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. కంటైనర్ రాజమహేంద్రవరం మీదుగా హైదరాబాద్ వెళ్తోంది. గంజాయిని, కంటైనర్‌ను స్వాధీనం చేసుకుని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.


గంజాయిని రవాణా చేస్తున్న కంటైనర్

అల్లూరు కుటుంబానికి పూర్తి అండ


కృష్ణంరాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి వేణు, ఎమ్మెల్యే రాపాక తదితరులు

- వైఎస్సార్ సీపీ నేత, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- కృష్ణంరాజుకు నివాళి
- కుటుంబ సభ్యులకు పరామర్శ

సఖినేటిపల్లి: రాజోలు మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు కుటుంబానికి వైఎస్సార్ సీపీతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లవేళలా పూర్తిగా అండగా ఉంటారని ఆ పార్టీ ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. సఖినేటిపల్లిలోని నివాసంలో కృష్ణంరాజు కుమారుడు శ్రీనివాసరాజు, భార్య మల్లీశ్వరి, కుమార్తెలను ఆయన శనివారం పరామర్శించారు. అనంతరం కృష్ణంరాజు మృతికి సంతాపంగా జననీరాజనం పేరిట ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొన్నారు. తొలుత వేదికపై కృష్ణంరాజు చిత్రపటానికి సుబ్బారెడ్డి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తితో ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి అంకితమైన మహోన్నత వ్యక్తి కృష్ణంరాజు అని కొనియాడారు. దళితులు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో శ్రద్ధతో కృషి చేశారని చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ మరణానంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబం పట్ల ఎంతో విధేయతతో ఉన్నారని అన్నారు. ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమని సంతాపం తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, తనకు అల్లూరు ఇచ్చిన రాజకీయ జీవితాన్ని ఆయనకే అంకితమయ్యేటట్లు జీవించడమే తాను ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. సీఎం జగన్ ఆదేశాలతో కృష్ణంరాజు అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో పూర్తి చేశామని చెప్పారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ, తమ గురువు కృష్ణంరాజు వద్ద మంత్రి వేణు, ఎమ్మెల్యేగా తాను శిష్యరికం చేశామని అన్నారు. మారుమూల పుట్టిన తనను, వేణును అల్లూరు ఉన్నత స్థాయికి తీసుకువెళ్లారని చెప్పారు. చివరి దశలో తాను, వేణు ఆయన పాడె మోసి, చివరి వరకూ వెంట నడిచి గురువు రుణం తీర్చుకున్నామని అన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యేలు గొల్లపల్లి సూర్యారావు, పాముల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధికి వచ్చి.. అనంత లోకాలకు..

గండేపల్లి: జీవనోపాధి కోసం కూలి పనులకు వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తూ చెరువులో పడి దుర్మరణం పాలయ్యాడు. గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ కథనం ప్రకారం.. గోకవరం గ్రామానికి చెందిన చింతల అనిల్ కుమార్ (24) తన చిన్నాన్న చింతల రాము, మరి కొందరితో కలిసి 15 రోజులుగా తాపీ పనికి గండేపల్లి వస్తున్నాడు. రోజులానే శుక్రవారం కూడా పనికి వచ్చిన అతడు మధ్యాహ్న భోజనం అనంతరం చిన్నాన్న మోటార్ సైకిల్‌పై గ్రామ శివారున విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కలవచర్ల మార్గంలోని కామ చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. చెరువులోకి దిగుతూండగా కాలు జారి అందులో పడి మృత్యువాత పడ్డాడు. అయితే బయటకు వెళ్లిన అనిల్ కుమార్ ఎంతసేపయినా రాకపోవడంతో అతడి చిన్నాన్న రాముతో పాటు తోటి కూలీలు వెతకడం ప్రారంభించారు. చెరువు సమీపాన అనిల్ కుమార్ చెప్పులు, మోటార్ సైకిల్ కనిపించాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో చెరువులో పడిపోయినట్టు తెలిసి అతడి కోసం గాలింపు చేపట్టారు. అనిల్ కుమార్ మృతదేహం శనివారం లభ్యమైంది. తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మికి ముగ్గురు కుమారులు కాగా, మృతుడు అనిల్ కుమార్ రెండో సంతానం. ఇంటర్ పూర్తి చేసి కుటుంబానికి చేదోడుగా కూలి పనులకు వెళ్తూ.. మృత్యువాత పడ్డాడని అతడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అనిల్ కుమార్‌కు అన్న శివరామకృష్ణ, ఇంటర్ చదువుతున్న తమ్ముడు సతీష్ ఉన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

సీతానగరం: అప్పుల బాధ తట్టుకోలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై కె.చిరంజీవి కథనం ప్రకారం.. సీతానగరానికి చెందిన అల్లిమిల్లి మహాలక్ష్మి (36) భర్త మునికుమార్‌కు చిన్న కిరాణా దుకాణం ఉంది. వారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కిషోర్ రాజా ఇంటర్, రెండో కుమారుడు వెంకటసాయి పదో తరగతి చదువుతున్నారు. మహాలక్ష్మి 20 వరకూ చిట్టీలు వేసి, అవసరానికి వాటిని పాడుకుని నగదు తీసుకుంది. కానీ, వాటిని చెల్లించేందుకు బయట అప్పులు చేసింది. అయితే చిట్టీల నిర్వాహకులు, అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో తట్టుకోలేకపోయింది. భర్త మునికుమార్ చిరు వ్యాపారం నిమిత్తం శనివారం బయటి ప్రాంతానికి వెళ్లాడు. దీంతో పెద్ద కుమారుడు కిషోర్‌రాజా కిరాణా షాపులో ఉన్నాడు. రెండో కుమారుడు వెంకట సాయి స్కూల్‌కు వెళ్లాడు. ఆ సమయంలో చిట్టీలు పాడిన వారి ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నానని లేఖ రాసిన మహాలక్ష్మి ఇంటి చూరుకు ఉన్న సిమెంట్ స్తంభానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొంతసేపటికి కిరాణా షాపు నుంచి వచ్చిన కిషోర్‌రాజా తల్లి ఉరి వేసుకుని ఉండటం చూసి బోరున విలపిస్తూ కేకలు వేశాడు. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై చిరంజీవి సంఘటన స్థలానికి చేరుకుని, మహాలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త మునికుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము లేకే పొత్తులకు వెంపర్లాట

- అవినీతికి తావు లేని వ్యవస్థలపై బురద
- ప్రతిపక్షాలపై టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి విమర్శ


విలేకర్లతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తాళ్లరేవు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము లేకనే ప్రతిపక్షాలు పొత్తులంటూ వెంపర్లాడుతున్నాయని, ఎంతమంది కలసి వచ్చినా సీఎంకు సరిపోరని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పిల్లంకలో వైఎస్సార్ సీపీ నేత చింతలపాటి శ్రీనివాసరాజు నివాసంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి సంపూర్ణ ఆశీర్వాదం ఉందన్నారు. ఆయనను ఒంటరిగా ఎదుర్కోలేకనే ప్రతిపక్ష నాయకులు పొత్తులంటూ వెంపర్లాడుతూ మతి తప్పి మాట్లాడుతున్నారని విమర్శించారు. 'ప్రతిపక్షాలు ఇద్దరు కలిసి వచ్చినా రెడీయే.. ముగ్గురు కలిసి వచ్చినా లేక నాలుగో వ్యక్తి రామోజీరావుతో కలసి వచ్చినా తాము సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. ప్రజలందరూ తమకు అండగా ఉన్నారని, రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని చెప్పారు. అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్ వ్యవస్థపై కావాలనే బురద చల్లుతున్నారని సుబ్బారెడ్డి అన్నారు. గత రెండేళ్లుగా తమ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిగతంగా దాడి చేయడం ప్రతిపక్షాలకు, కొన్ని పత్రికలకు అనవాయితీగా మారిందని గుర్తు చేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య వెనుక ఎవరున్నారనేది న్యాయస్థానాలు నిగ్గు తేలుస్తాయన్నారు. సీబీఐ, న్యాయస్థానాలనే పక్కదారి పట్టించే విధంగా గతంలో ప్రవర్తించారనే విషయాన్ని కూడా సాక్ష్యాధారాలతో కోర్టుకు సమర్పించారని చెప్పారు. అవన్నీ కోర్టు పరిధిలో ఉన్నాయన్నారు. ఎటువంటి ఆధారాలూ లేకపోయినా గూగుల్ టేక్ అవుట్ అంటూ సీబీఐ చార్జ్‌షీట్ దాఖలు చేసిందని, తమకు న్యాయస్థానాలపై నమ్మకముందని, తప్పకుండా న్యాయం జరుగుతుందని విలేకర్ల ప్రశ్నకు సమాధానంగా సుబ్బారెడ్డి చెప్పారు. విలేకర్ల సమావేశంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తదితరులు ఉన్నారు.

మిస్ సుప్రనేషనల్ ఆసియాగా కోనసీమ అమ్మాయి


మిస్ సుప్రనేషనల్ ఆసియా కిరీటాన్ని ధరిస్తున్న ప్రగ్న్య

అమలాపురం టౌన్: గత నెలలో పోలెండ్ దేశంలో జరిగిన అందాల పోటీల్లో కోనసీమకు చెందిన అమ్మాయి ప్రగ్న్య అయ్యగారి (21) మిస్ సుప్రనేషనల్ కిరీటాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడిన ప్రగ్న్య సొంతూరు అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు. దాదాపు 25 ఏళ్ల కిందటే ఆమె తండ్రి శ్రీనివాసరావు, తల్లి మాధవి ఉద్యోగ రీత్యా హైదరాబాద్ వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. శ్రీనివాసరావు సోదరి దేశరాజు పద్మ కుటుంబం అమలాపురంలోనే నివాసం ఉంటోంది. మిస్ సుప్రనేషనల్ ఆసియా కిరీటాన్ని తన మేనకోడలు ప్రగ్న్య సొంతం చేసుకోవడడంపై పద్మ సంతోషం వ్యక్తం చేశారు. గత ఏడాది ముంబైలో జరిగిన అందాల పోటీల్లో కూడా ప్రగ్న్య లివ మిస్ దివ సుప్రనేషనల్ అందాల విజేతగా నిలిచింది. తద్వారా ఇప్పుడు పోలెండ్‌లో జరిగిన పోటీల్లో ఇండియా తరఫున పాల్గొని విజేత అయింది. ఈ అందాల పోటీల్లో మిస్ ఆసియా కిరీటం కోసం 70 దేశాల నుంచి పోటీ పడ్డారని ప్రగ్న్య చెప్పింది. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్(ఐఎన్ఐఎఫ్‌డీ)లో ప్రగ్న్య ఫ్యాషన్ కోర్సులో శిక్షణ పొంది, ఈ స్థాయి విజేత అయిందని ఆమె తల్లి మాధవి 'సాక్షి'కి చెప్పారు.

వాడపల్లి వెంకన్నకు రూ.23 లక్షల ఆదాయం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శనివారం వివిధ సేవల ద్వారా రూ.23,11,443 ఆదాయం సమకూరింది. కరెన్సీ నోట్లు, తామర తదితర పుష్పాలతో అలంకరించిన స్వామివారిని సుమారు 30 వేలు మంది భక్తులు దర్శించుకున్నారు. ఈ నెల 26న స్వామి వారి హుండీల ఆదాయం లెక్కిస్తామని ఆలయ ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.


వేంకటేశ్వరస్వామి దర్శనానికి క్యూకట్టిన భక్తులు